www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం...

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | బుధ వారం, 09 నవంబర్ 2022 | ఎడిటర్ : గోనుకొండ వృద్విరాజు | సంపుటి - 07, సంచిక-185 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

## సింగరేణిని ప్రైవేట్ చేసే కుట్రలో మోడీ






రామగుండం ఫ్యాక్టరీని మళ్లీ రీ ఓపెన్ ఎలా చేస్తారు

10న సింగరేణి ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు

మోడీ పర్యటనకు వ్యతిరేకంగా సిపిఐ ఆందోళనలకు పిలుపు

**హైదరాబాద్,నవంబర్8(సమ సమాజం):** తెలంగాణలో మోడీ పర్యటనను అడ్డుకుంటామని సిపిఐ ప్రకటించింది. తెలంగాన పర్యటనతో ఒరిగేదేమీ లేదని సిపిఐ ప్రకటించింది. ఈ మేరకు బీజేపీపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసమే ఈనెల 12వ తేదీన రామంగుండం ఎరువుల ఫ్యాక్టరీని రీ ఓపెన్ చేసేందుకు ప్రధాని మోడీ తెలంగాణకు వస్తున్నారని విమర్శించారు. ప్రధానికి తెలంగాణపై అనుకోని ప్రేమ పుట్టుకొచ్చిందన్నారు. మునుగోడు ఉప ఎన్నికలో విజయం సాధించిన తర్వాతనే షెడ్యూల్ ప్రకారమే మోడీ టూర్ ను బీజేపీ ప్లాన్ చేసిందన్నారు. ఏడాది క్రితం ప్రారంభమైన ఎరువుల ఫ్యాక్టరీనీ మళ్లీ రీ ఓపెన్

2వ

# మునుగోడు విజయంతో లెఫ్ట్ నేతలకు కృతజ్ఞతలు

## మున్ముందు కూడా కలిసి పనిచేద్దామన్న మంత్రి




**హైదరాబాద్,నవంబర్8(సమ సమాజం):** మునుగోడు ఉప ఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి విజయానికి కృషి చేసిన సీపీఐ, సీపీఎం నేతలకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని సీపీఐ కార్యాలయానికి మంత్రి జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి వెళ్లారు. టీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి సీపీఐ, సీపీఎం నేతలు కృషి చేశారు. దేశంలో బీజేపీకి వ్యతిరేకంగా పని చేయాలని నిర్ణయం తీసుకున్నాం. సాఫీగా పాలన సాగుతుంటే ఉప ఎన్నికతో అలజడి సృష్టించారు. కమ్యూనిస్టు నేతల సహకారంతో టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి గెలిచారు. భవిష్యత్‌లోనూ ఐక్యంగా కలిసి ముందుకు వెళ్తామని మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. రాష్ట్రాన్ని పెద్ద విపత్తు నుంచి కాపాడామని సంతోషంగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. మునుగోడు ఉప ఎన్నికలో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని రాజగోపాల్ రెడ్డి అన్నారు. మరి రాజకీయ సన్యాసం తీసుకుంటారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో తామే ప్రత్యామ్నాయమని బీజేపీ భావిస్తుంది. బీజేపీకి అసలు తెలంగాణలో బలం లేదని అన్నారు. సీపీఎం, సీపీఐ సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని, తన విజయానికి సహకరించిన సీపీఎం, సీపీఐ నేతలకు ప్రత్యేక కృతజ్ఞతలని కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు.

## మంత్రి సబితకు సమాచారం ఇచ్చాం



రాజ్‌భవన్ వర్గాలు స్పష్టీకరణ

**హైదరాబాద్,నవంబర్8(సమ సమాజం):** తెలంగాణలో పెండింగ్ బిల్లులపై వివాదం ముదురుతోంది. యూనివర్శిటీలో నియామకాల బిల్లు విషయంలో తనకు ఎలాంటి సమాచారం రాలేదన్న మంత్రి సబిత వ్యాఖ్యలకు రాజ్‌భవన్ కార్యాలయం కౌంటర్ ఇచ్చింది. సోమవారం మెసెంజర్ ద్వారా మంత్రికి సమాచారం ఇచ్చామని తెలిపింది. ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వం రాజ్‌భవన్‌పై కుట్ర చేసే ప్రయత్నం చేస్తోందని పేర్కొంది. పెండింగ్ బిల్లులు, యూనివర్శిటీ కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డులో నియామకాలపై యూసీజీతోపాటు మంత్రి సబితకు సోమవారం లేఖ రాశామని, తక్షణమే రాజ్‌భవన్‌కు వచ్చి వాటన్నింటిపై వివరణ ఇవ్వాల్సిందిగా సమాచారం పంపించామని రాజ్‌భవన్ కార్యాలయం స్పష్టం చేసింది. అయితే సమాచారం అందలేదని మంత్రి చెప్పడం సరికాదదంది.కాగా గవర్నర్ కార్యాలయం నుంచి తనకు ఎలాంటి సమాచారం రాలేదని మంత్రి సబిత తెలిపారు. లేఖ అందిన వెంటనే స్పందించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. గవర్నర్ కార్యాలయం ప్రజలను తప్పుదోవ పట్టించే చర్యలు మానుకోవాలని మంత్రి సూచించారు.

## హాస్టల్ నిర్మించాక కూడా సమస్య ఎందుకు



నిజాం కాలేజీ విద్యార్థుల ఆందోళనపై కెటిఆర్ ట్వీట్

**హైదరాబాద్,నవంబర్8(సమ సమాజం):** నిజాం కాలేజ్ విద్యార్థినుల ఆందోళనపై మంత్రి కేటీఆర్ స్పందించారు. హాస్టల్ అలాట్‌మెంట్ సమస్యను పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. ఈ విషయంలో జోక్యం చేసుకుని సమస్యను వెంటనే పరిష్కరించేలా చూడాలని విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డికి సూచిస్తూ ట్వీట్ చేశారు. తాను ఇచ్చిన మాట ప్రకారం హాస్టల్ నిర్మించి కాలేజీకి అందించిన తర్వాత వివాదం అవసరమా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ సమస్యకు వెంటనే ముగింపు పలకాలని నిజాం కాలేజ్ ప్రిన్సిపాల్‌కు ఆదేశించారు. కేటీఆర్ ట్వీట్ పై మంత్రి సబితా ఇంద్రారెడ్డి స్పందించారు. నిజాం కాలేజ్ విద్యార్థినుల హాస్టల్ సమస్యను స్వయంగా పర్యవేక్షించి సాధ్యమైనంత తొందరగా పరిష్కరిస్తానని కేటీఆర్ కు చెప్పారు.

## ఈ ఏడాదిలో ఇదే చివరి గ్రహణం



ఈశాన్య రాష్ట్రాల్లో సంపూర్ణ గ్రహణం

తెలుగు రాష్ట్రాల్లో పాక్షిక గ్రహణం

**న్యూఢిల్లీ,నవంబర్8(సమ సమాజం):** ప్రపంచవ్యాప్తంగా చంద్రగ్రహణం ఏర్పడింది. ఈ ఏడాది చివరి గ్రహణం ఇదేనని ఖగోళ శాస్త్రవేత్తలు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల 39 నిమిషాలకు గ్రహణం మొదలైంది. సాయంత్రం 6 గంటల 19 నిమిషాల వరకు

2వ

## చేపవిత్తనాల సరఫరాలో ఆలస్యం



ఎదగని పిల్ల విత్తనాల సరఫరా

నగదు బదిలీ పథకం వర్తింప చేయాలి

మత్స్యకార సంఘాల కొత్త ప్రతిపాదన

**హైదరాబాద్,నవంబర్8(సమ సమాజం):** ఉచిత చేప పిల్లల పంపిణీలో మత్స్యకార సంఘాలకే పెత్తనం ఉండాలని కోరుకుంటున్నాయి. నేరుగా చేపపిల్లల పంపిణీ కాకుండా నగదు బదిలీ చేస్తే తామే అవసరమైన విత్తనాలను సమకూర్చు కుంటామని, అలాగే వాటిని పెంచుతామని అంటున్నాయి. ప్రతి ఏటా చేప పిల్లల విడుదలలో ఆలస్యంపై మత్స్యకార సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఇటీవల గొర్రెల పంపిణీ పథకంలో నగదు బదిలీ విధానాన్ని తీసుకువచ్చినట్లుగానే చేప పిల్లలు కాకుండా వాటికి అయ్యే ఖర్చును మత్స్యకార సంఘాలకే అందించాలని అంటున్నారు. మత్స్యకారులే నాణ్యమైన పిల్లలను కొనుక్కొని తెచ్చుకుంటారని చెబుతున్నారు. ప్రభుత్వం ఉచిత చేప పిల్లలను సకాలంలో పంపిణీ

2వ

## తెలంగాణలో ముగిసిన జోడో యాత్ర

మహారాష్ట్రలో ప్రవేశించిన రాహుల్● నాందేడ్ గురుద్వారాలో రాహుల్ పూజలు● స్వాగతం పలికి ఆశీస్సులు అందించిన గురుద్వారా పెద్దలు

**నాందేడ్/కామారెడ్డి,నవంబర్8(సమ సమాజం):** కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేపట్టిన 'భారత్ జోడో యాత్ర' తెలంగాణలో ముగిసి, మహారాష్ట్రలో ప్రవేశించింది. అక్కడి నేతలు ఘనంగా స్వాగతం పలికారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మంగళవారం మహారాష్ట్రలోని నాందేడ్‌లో గురునానక్ ఆశీర్వాదాలతో భారత్ జోడో యాత్రను ప్రారంభించారు. గురు నానక్ జయంతి సందర్భంగా గురుద్వారా యాద్గారి బాబా జోరవర్ సింగ్ జీ ఫతేహ్ సింగ్ జీ నుంచి ఆశీర్వాదాలు పొందారు. ఆయన గురునానక్ గురు పూరబ్ ఆర్దాస్ సమర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ట్వీట్‌లో, గురు ఆశీర్వాదాలతో పాదయాత్రను గురుద్వారా యాద్గారి బాబా జోరవర్ సింగ్ జీ ఫతేహ్ సింగ్ జీ నుంచి ప్రారంభించినట్లు తెలిపింది. రాహుల్ గాంధీ ఇచ్చిన ట్వీట్‌లో, మహారాష్ట్రలో భారత్‌జోడో యాత్రను ప్రారంభించినట్లు తెలిపారు. గురుపూరబ్ శుభ సందర్భంగా గురుద్వారా యాద్‌గారీ బాబా జోరవర్ సింగ్ జీ, ఫతేహ్ సింగ్ జీలో అర్దాస్ చేసినట్లు తెలిపారు. గురు నానక్ ప్రేమ, శాంతి, సోదర భావం నుంచి స్ఫూర్తిని పొందుతూ భారత దేశాన్ని ఏకం చేయాలనే సంకల్పాన్ని

2వ



## ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం



పోలీసుల దర్యాప్తుపై స్టే ఎత్తివేత

దర్యాప్తు చేయవచ్చన్న హైకోర్టు

పెండింగ్‌లో బిజెపి పిటిషన్..విచారణ 18కి వాయిదా

**హైదరాబాద్,నవంబర్8(సమ సమాజం):** టీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో పోలీసుల దర్యాప్తుపై గతంలో విధించిన తాత్కాలిక స్టేను హైకోర్టు ఎత్తి వేసింది. ఈ కేసులో పోలీసులు దర్యాప్తు చేయవచ్చని తెలిపింది. ఎమ్మెల్యేల కొనుగోలు కేసును సీబీఐకి

2వ

## సంపాదకీయం

# ప్రజాస్వామ్యానికి పాలక పార్టీల తూట్లు !

తమకు కష్టం వచ్చినప్పుడు విలువల గురించి, ప్రజాస్వామ్యం గురించి గొంతు చించుకునే పార్టీలు అధికారంలోకి రాగానే అన్నీ మర్చిపోతున్నాయి. అధికారంలోకి రాగానే వ్యవస్థలను నిర్వీర్యం చేయడంలో అన్ని పార్టీలు పోటీపడుతున్నాయి. కేంద్రంలో బిజెపి కూడా ఇందుకు అతీతం కాదని నిరూపించుకుంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యాన్ని పాతరేస్తున్న పాలక పక్షలు ఇతర విషయాల్లో ఆవేదన చెందు తున్నాయి. తమవరకు వస్తే గాని అన్న రీతిలో ఉన్నాయి. ఎపిలో నిరంకుశ పాలన సాగుతోంది. విపక్షాలను భయపెట్టడం,దాడులు చేయడం లాంటి చ్యలకు ఉపక్రమిస్తున్నారు. అనేక కేసుల్లో ఉండి,బెయిల్‌పై ఉన్న జగన్ విపక్షనేతలను అదే దారిలో నడవాలన్న రీతిలో ఉన్నట్లుగా ఉంది. కేసులు పెట్టడం,అర్ధరాత్రిళ్లుఅరెస్టు లు చేయడం,దాడులు చేయడం,కూల్చవేతలతో బెదిరించడం వంటి నిరంకుశ విధానాలు అవలంబి స్తున్నారు. అమరావతి రైతుల పాదయాత్రను అడుగడుగునా అడ్డుకునే యత్నాలు సాగుతున్నాయి. గత పాలకులు పాపులు అన్న రీతిలో నాయకుల వ్యాఖ్యలు ఉంటున్నాయి. అవినీతిని చెండాడుతున్నామన్న జగన్..తానూ అవినీతికొమ్మనే అని గుర్తించడం లేదు. ఇకపోతే తెలంగాణలో అంతకాకున్నా కొంతయినా నిరంకుశ విధానాలు ఉన్నాయి. గతంతో పోలిస్తే ఇప్పుడు తగ్గాయని చెప్పుకోవచ్చు. బిజెపి దూకుడు రాజకీయాలతో కొంత వెనక్కి తగ్గారు. ఇకపోతే మునుగోడు ఉప ఎన్నికను ఇంత ప్రహసనంగా మార్చినం దుకు బీజేపీ, టీఆర్ఎస్ తెలంగాణ సమాజానికి సంజాయిషీ ఇవ్వాల్సి ఉంటుంది. వ్యవస్థలు పతనమైతే జరిగే అనర్థాలకు ఇదొక ఉదాహరణ. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం రాష్ట్రంలో అధికార పార్టీకి, కేంద్ర ప్రభుత్వ సంస్థలు కేంద్రంలో అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా పనిచేస్తున్నప్పటికీ ఎన్నికల కమిషన్ అచేతనంగా ఉండిపోవడం దారుణంకాక మరోటి కాదు. అధికారంలో ఉన్నవారికి అంతులేని అధికారం, ధనబలం సొంతం కావడంవల్ల ఎన్నికలు పూర్తిగా కలుషితమయ్యాయి. మునుగోడు ఉప ఎన్నిక ప్రజాస్వా మ్యానికి పాతరేసింది. ఎన్నికల్లో డబ్బులు పంచడం, తీసుకోవడం, ఇతర పార్టీల నాయకులను కొనుగోలు చేయడం వంటివి ఇప్పుడు చట్టబద్ధం అయ్యాయా అన్నరీతిలో సాగాయి. అయినా ఇవేవీ ఎవరికీ తప్పుగా కనిపించడం లేదు. మునుగోడు ఎన్నిక ముగిసిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ప్రజాస్వామ్యాన్ని బతకనీ యండి అని కేంద్ర ప్రభుత్వ పెద్దలకు విజ్ఞప్తి చేశారు. తన పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలను బీజేపీ తరపున కొందరు కొనుగోలు చేసే ప్రయత్నం చేశారని ఆరోపణలు చేశారు.ఆ వ్యవహారాన్ని ఆడియో, వీడియోల్లో రికార్డు చేసిన కేసీఆర్ దాదాపు మూడు గంటలపాటు నిర్వహించిన విలేకరుల సమావేశంలో తన ఆవేదనను వెళ్లగక్కారు. ఇదే విషయంలో మునుగోడులో మా÷-తరం చేయలేకపోయారు. అక్కడ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు. ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారాన్ని ప్రత్యేకంగా చూడాలని న్యాయ వ్యవస్థ కు కూడా కేసీఆర్ విజ్ఞప్తి చేయడం చూస్తుంటే ఎన్నో అన్యాయాలకు నిలయంగా ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నా వాటి గురించి మాత్రం ఆక్రోశం ప్రకటించలేదు. ప్రధానంగా ధరణితో ఎందరో వీధిన పడ్డారు. భూసేకరణలో ఎందరో తమభూములను కల్పోయారు. బలవం తంగా ఆక్రమించుకున్నారు. ఇవేవీ కెసిఆర్‌కు అక్రమంగా కనిపించలేదు. ఎమ్మెల్యేలను బలవంతంగా టిఆర్ఎస్‌లోచేర్చుకున్నా ప్రజాస్వామ్యానికి ముప్పులేదని తీర్మానించుకున్నారు. ఫాంహౌస్ సంఘటన జరిగిన వారం తర్వాత కేసీఆర్ బయటకు వచ్చి ఈ విషయం మాట్లాడటం, అప్పటికే ఇందుకు సంబం ధించిన ఆడియోలు విడుదల కావడం, తాజాగా విడుదల చేసిన వీడియోలలో అంశాలపై ప్రజల్లో పెద్దగా స్పందన లేకపోవడం వంటివి కెసిఆర్ రాజకీయాల పట్ల పరజలకు నమ్మకం లేదనడానికి నిదర్శనంగా చూడాలి. నిజానికి ఇదంతా కూడా కెసిఆర్ నడిపిస్తున్న డ్రామాగానే జనంచూస్తున్నారు. అందువల్లనే కేసీఆర్ ఆశించినట్టుగా రాజకీయాల్లో కుదుపు ఏర్పడలేదు. 2014లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిపక్షాలకు చెందిన ఎమ్మెల్యేలను టిఆర్ఎస్‌లో చేర్చుకుంటూ వచ్చారు. 2014 తర్వాత పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతోపాటు తెలుగుదేశం పార్టీ తరపున ఎన్నికైన ఎమ్మెల్యేలను కలిపేశారు. 2018 ఎన్నికల తర్వాత కూడా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తన పార్టీలో కలిపేసుకున్నారు. తెలుగు దేశం పార్టీ తరపున గెలిచిన ఇద్దరిని కూడా కబళించారు. సీపీఐ తరపున గెలిచిన ఒకే ఒక సభ్యుడిని కూడా కలిపేసుకున్నారు. 2014లో తెలుగుదేశం పార్టీ తరపున నెగ్గిన తలసాని శ్రీనివాస యాదవ్‌ను ఏకంగా మంత్రిని చేసిన కేసీఆర్ తన చర్యను సమర్థించుకోగలరు. ఉమమడి ఎపిలో రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి గా ఉన్నప్పుడు టీఆర్ఎస్ శాసనసభ్యులు కొందరిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోగా, ఇదెక్కడి న్యాయం అంటూ కెసిఆర్ ఆక్రోశించారు. తెలంగాణలో ప్రతిపక్షమే ఉండకూడదు అన్నట్టుగా కేసీఆర్ రాజకీయయాత్ర కొనసాగింది. ప్రతిపక్షాల ఉనికి కేసీఆర్‌కు గిట్టనట్టుగా సాగింది. ఇప్పుడు బిజెపి ఆ పని చేపట్టేసరికి కెసిఆర్ జీర్ణించు కోలేక పోతున్నారు. తన ప్రభుత్వాన్ని కూలదోయడానికి కుట్ర చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్న కేసీఆర్‌కు గతంలో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు చేసిన విమర్శలు ఎందుకు కనిపించలేదన్నదే ప్రశ్న. ఇప్పుడు బీజేపీని తప్పుపట్టే నైతికత కెసిఆర్‌కు కూడా లేదు. దేశంలో దాదాపు అన్ని రాజకీయ పార్టీలు అనైతిక చర్యలకు పాల్పడుతున్నందున కొనుగోళ్ల వ్యవహారాన్ని కూడా ప్రజలు సీరియస్‌గా తీసుకోవడం లేదు. అయితే ఈ వ్యవహారంతో రాజకీయంగా లబ్ధి పొందడానికే కెసిఆర్ ఎత్తులు వేశారన్న ప్రచారం కూడా కనిపిస్తున్నది. ఇకపోతే ఎపిలో కూడా చంద్రబాబు అధికరాంలో ఉండగా విపక్ష వైసిపి ఎమ్మెల్యేలను కలిపేసుకున్నారు. రోజాలాంటి ఎమ్మెల్యేను అసెంబ్లీలో అడుగు పెట్టనీయకుండా కుతంత్రాలు చేశారు. మొత్తంగా అన్నిరాజకీయా పార్టీలు అప్రజాస్వామికి విధానాలనే కొనసాగించారు. ఎవరు కూడా అతీతులం కాదని నిరూపించారు. ప్రజాస్వామ్యం గురించి అరిచి గీ పెడుతున్న వారంతా ముందు తమనుతాము ప్రక్షాళనచేసుకోవాలి. గతాన్ని నెమరేసుకోవాలి. నిబద్ధ రాజకీయాలు నడపాలి. అప్పుడే ప్రజలు కూడా ఆదరిస్తారు.

**పృద్విరాజ్ గోసుకొండ**
ఎడిటర్

# తెలంగాణలో ముగిసిన జోడో యాత్ర

(మొదటి పేజీ తరువాయి) నెరవేరుస్తామన్నారు. ప్రజలందరికీ గురుపూరబ్ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. భారత్ జోడో యాత్ర సోమవారం తెలంగాణా నుంచి మహారాష్ట్రలో ప్రవేశించింది. చివరిరోజు కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలో జోరుగా హుషారుగా సాగింది. ఆదివారం రాత్రి పెద్దకొడప్‌గల్‌లో బస చేసిన రాహుల్ సోమవారం ఉదయం 6.30 గంటలకు బిచ్కుంద మండలం పత్లాపూర్‌లో యాత్ర ప్రారంభించారు. రాహుల్‌తో జాతీయ, రాష్ట్ర, స్థానిక నాయకులు అడుగులో అడుగేస్తూ ముందుకు సాగారు. కందర్‌పల్లి, రాజుల్లా గేట్ మీదుగా తొమ్మిది గంటల వరకు షేకాపూర్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాంపు వరకు సాగింది. సాయంత్రం వరకు జాతీయ, రాష్ట్ర నేతలతో సమావేశాలు నిర్వహించారు. నేతలు రావడంతో సందడిగా మారింది. సాయంత్రం 5 గంటలకు కళాకారులు ప్రదర్శనలతో తిరిగి యాత్ర సాగింది. అనంతరం మేనూర్ వద్ద బహిరంగ సభలో రాహుల్ గాంధీ మాట్లాడారు. అనంతరం రాష్ట్ర సరిహద్దు మహరాష్ట్రలోకి జోడో యాత్ర ప్రవేశించింది. ఈ సందర్భంగా జోడో యాత్రకు తెలంగాణ నాయకులు, ప్రజలు ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో యాత్ర ఇన్‌చార్జి జైరాం రమేశ్, దిగ్విజయ్ సింగ్, రాష్ట్ర పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి, సీనియర్ నేత షబ్బీర్ అలీ, డీసీసీ ప్రెసిడెంట్ కైలాష్ శ్రీనివాస్‌రావు, భట్టి విక్రమార్క, వి. హనుమంతరావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మధు యాష్కీ గౌడ్, వడ్డేపల్లి సుభాష్రెడ్డి, పొన్నం ప్రభాకర్, ములుగు ఎమ్మెల్యే సీతక్క, శ్రీధర్ బాబు, జుక్కల్ నాయకులు గుడుగు గంగాధర్, గంగారాం స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మద్యం, ధన ప్రవాహంతోనే మునుగోడులో టీఆర్ఎస్ విజయం సాధించిందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. భారత్ జోడో యాత్ర ముగగింపు సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మునుగోడులో విచ్చలవిడిగా డబ్బు, మద్యం పారించాయన్నారు. రాష్ట్రంలో రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రకు మంచి స్పందన వచ్చిందన్నారు. ఢిల్లీకో సుల్తాన్, తెలంగాణకో సుల్తాన్ ఉన్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, సీఎం కేసీఆర్‌పై మాజీ మంత్రి షబ్బీర్ అలీ విమర్శించారు. వీరిద్దరు కలిసి దేశాన్ని, రాష్ట్రాన్ని నాషనం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలు అంటేనే ధనం అనే విధంగా బీజేపీ, టీఆర్ఎస్ పార్టీలు తయారు చేశాయన్నారు.



# ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారం

(మొదటి పేజీ తరువాయి) అప్పగించాలన్న బీజేపీ పిటిషన్ తాత్కాలికంగా పెండింగ్‌లో పెట్టింది. బీజేపీకి ఈ కేసులో పిటిషన్ వేయటానికి అర్హత ఉందని తెలిపింది . కౌంటర్ దాఖలు చేయాలని పిటిషనర్ ను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 18 కి వాయిదా వేసింది. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరుతూ బీజేపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. పోలీసుల దర్యాప్తు పారదర్శకంగా జరగడం లేదని బీజేపీ తరపున న్యాయవాది వాదించారు. పోలీసుల తీరు అనుమానాలకు తావిచ్చేలా ఉందన్నారు. సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జి పర్యవేక్షణలోని సిట్ దర్యాప్తు జరిపితే వాస్తవాలు బయటపడతాయని కోర్టుకు వివరించారు. ఈ క్రమంలో మంగళవారం మరోసారి బీజేపీ పిటిషన్ ను విచారించిన హైకోర్టు .. పోలీసులు దర్యాప్తు చేయవచ్చని చెప్పింది. ఈ కేసులో మొయినాబాద్ పోలీసులు దర్యాప్తు చేసుకోవచ్చని కోర్టు ఆదేశించింది. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో రామచంద్ర భారత అలియాస్ సతీశ్ శర్మ, సింహయాజీ, నంద కుమార్‌లను రిమాండ్‌కు తరలించిన సంగతి తెలిసిందే. ఈ ముగ్గురు ప్రస్తుతం చంచల్ గూడ జైల్లో ఉన్నారు. ఎమ్మెల్యేలను ప్రలోభ పెడుతున్నారనే ఆరోపణలతో మోయినాబాద్ ఫాం హౌస్‌లో గతనెల 26వ తేదీ రాత్రి రామచంద్ర భారత అలియాస్ సతీశ్ శర్మ, సింహయాజీ, నంద కుమార్‌లను సైబరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తాండూరు ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, పినపాక ఎమ్మెల్యే రేగ కాంతారావులను పార్టీ ఫిరాయించేలా ప్రలోభపెట్టారని పోలీసులు తెలిపారు.

# రాష్ట్రంలో 14 మంది అడిషనల్ కలెక్టర్ల బదిలీ

## పలువురికి పోస్టింగ్ ఇవ్వకుండా పెండింగ్

**హైదరాబాద్,నవంబర్8(సమ సమాజం):** రాష్ట్రంలో 14 మంది అడిషనల్ కలెక్టర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. నల్గొండ అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మను వికారాబాద్‌కు బదిలీ చేయగా.. ఆయన స్థానంలో కుష్బూ గుప్తాను నియమించింది. బీ రాహుల్‌ను మంచిర్యాల అడిషనల్ కలెక్టర్‌గా నియమించింది. మయాంక్ మిట్టల్‌ను నారాయణపేట అడిషనల్ కలెక్టర్‌గా నియమించగా.. అక్కడ పనిచేస్తున్న కందూరి చంద్రారెడ్డిని అడ్మినిస్ట్రేటివ్ డిపార్ట్‌మెంట్?లో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. అశ్విని తానాజీ వాంఖడేను వరంగల్ అడిషనల్ కలెక్టర్ గా బదిలీ చేయగా.. అక్కడ పనిచేస్తున్న హరిసింగ్‌ను బదిలీ చేసింది. మంద మకరందున జగిత్యాలకు బదిలీ చేయగా.. ఇక్కడ పనిచేస్తున్న జడల అన్సారీని అడ్మినిస్ట్రేటివ్ డిపార్ట్‌మెంట్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. ప్రఫుల్ దేశాయ్‌ను జనగామకు బదిలీ చేయగా.. అబ్దుల్ హమీద్‌ను అడ్మినిస్ట్రేటివ్ డిపార్ట్‌మెంట్‌లో రిపోర్ట్ చేయాలని చెప్పింది. అభిషేక్ అగస్త్యను మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాకు బదిలీ చేయగా.. ఇక్కడ పనిచేస్తున్న జాన్ శ్యామ్ సన్ ను అడ్మినిస్ట్రేటివ్ డిపార్ట్‌మెంట్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. అపూర్వ చౌహాన్‌ను జోగులాంబ గద్వాల అడిషనల్ కలెక్టర్ గా నియమించింది.

# ఈ ఏడాదిలో ఇదే చివరి గ్రహణం

(మొదటి పేజీ తరువాయి) గ్రహణం కొనసాగింది. ఈశాన్య, తూర్పు రాష్ట్రాల్లోనే సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడింది. తెలుగు రాష్ట్రాల్లో పాక్షిక చందగ్రహణం ఏర్పడుతుంది. కొన్ని నగరాల్లో చందగ్రహణం సంపూర్ణంగా కనిపించినా.. హైదరాబాద్‌లో మాత్రం పాక్షికంగా ఉంటుందని శాస్త్రవేత్తలు చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో చంద్రగ్రహణం పాక్షికమే అని ప్లానెటరీ సొసైటీ డైరెక్టర్ రఘునందన్ అన్నారు. దేశంలోని ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు రాష్ట్రాల్లోనే కొద్దిసేపు సంపూర్ణ చంద్రగ్రహణం కనిపిస్తుందన్నారు. మధ్యాహ్నం ఒకటిన్నర నుంచి రాత్రి 7 గంటల 28 నిమిషాల వరకు గ్రహణం కాలం ఉంటుందన్నారు. కంటికి కనిపించే గ్రహణం మధ్యాహ్నం 2 గంటల 39 నిమిషాల నుంచి సాయంత్రం 6 గంటల 19 నిమిషాల వరకు ఉంటుందన్నారు. సాయంత్రం పూట గ్రహణం కనిపిస్తుందని చెప్పారు. సాయంత్రం సమయంలో దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి గ్రహణం కనిపించనుంది. కోల్ కతా, గౌహతిలో చంద్రగ్రహణం సంపూర్ణంగా కనిపిస్తుంది. కోల్ కతాలో గంట 27 నిమిషాలు.. గౌహతిలో గంట 45 నిమిషాలు చంద్ర గ్రహణాన్ని చూడవచ్చని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.దక్షిణ అమెరికా, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా, ఆసియా, ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రంతో పాటు పసిఫిక్ మహాసముద్రాలను కవర్ చేసే ప్రాంతంలో చందగ్రహణం కనిపించనుంది. 2023 అక్టోబర్ 28న మరోసారి చందగ్రహణం ఏర్పడనుంది. కాగా, గ్రహణం కారణంగా తెలుగు రాష్ట్రాల్లోని ఆలయాలన్నీ మూతపడ్డాయి.

# చేపవిత్తనాల సరఫరాలో ఆలస్యం

(మొదటి పేజీ తరువాయి) చేస్తేనే లాభం ఉంటుందని కూడా అంటున్నారు. ఆగస్టు నెలలో ఇవ్వాల్సిన చేప పిల్లలను ఇప్పటివరకు పంపిణీ చేయలేదు. పిల్లలు చిన్న సైజులో ఉన్నందున వాటిని పెద్ద చేపలు తింటాయి. మత్స్య సహకార సంఘాలకు నగదు బదిలీ చేస్తే ఆ డబ్బుతో సకాలంలో చేప పిల్లలు పోసుకుంటామన్నారు. చేప పిల్లల సరఫరా చేసే టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు అగ్రిమెంట్ ను పక్కన పెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. పిల్లల సైజు, లెక్క విషయంలో కాంట్రాక్టర్లు మోసాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వారికి అధికారులు కూడా మద్దతు ఇస్తున్నారని అంటున్నారు. ఇటీవల కొన్నిచోట్ల చెరువులో చేప పిల్లలను విడిచే సమయంలో పిల్లల సంఖ్యపై అనుమానం కలిగింది. అధికారులను అడిగితే ప్రతి పెట్టెలో 5 వేల పిల్లల చొప్పున ఉంటాయని చెప్పగా, వాటిని లెక్కించాలని అధికారులు ఆదేశించారు. దీంతో 80 వేల పిల్లల్లో పది శాతం తక్కువగా ఉన్నట్లు తేలింది. దీంతో మత్స్యశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎంపీడీవోల సమక్షంలో సొసైటీ బాధ్యులతో చేప పిల్లల సైజు, పరిమాణం ఆర్డర్ ప్రకారం ఉన్నది లేనిది తనిఖీ చేయాలని, ఈ ప్రక్రియను వీడియో తీయించాలని ఖమ్మం కలెక్టర్ ఆర్డర్ వేశారు. ఇక ఇటీవల చెరువుల్లో వేసేందుకు తెచ్చిన 20 లక్షల పిల్లలు ఆఫీసర్లు చెప్పిన 0.35 మిల్లీమీటర్ల కంటే సైజు తక్కువ ఉండడంతో వాటిని రిజెక్ట్ చేశారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ భావిస్తున్నా క్షేత్రస్థాయిలో మోసాలు ఆగడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

# సింగరేణిని ప్రైవేట్ చేసే కుట్రలో మోడీ




(మొదటి పేజీ తరువాయి) చేయడం ఏంటని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ 8 ఏండ్లలో తెలంగాణకు ఇచ్చిన హామీలు ఏం నెరవేర్చారని కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. విభజన చట్టంలోని ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. సింగరేణిని ప్రైవేటు పరం చేసేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని మండిపడ్డారు. తెలంగాణలోని బొగ్గు బావులను బడా పారిశ్రామిక వేత్తలు ఆదానీ,అంబానీకి కేటాయించేందుకే ప్రధాని మోడీ రాష్ట్ర పర్యటనకు వస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తుంటే తాము చూస్తూ ఊరుకోమని కేంద్రానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ప్రధాని పర్యటనకు నిరసనగా ఈనెల 10వ తేదీ గురువారం ఐదు జిల్లాల్లోని బొగ్గు గనుల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. అలాగే తెలంగాణ పర్యటనకు వస్తున్న మోడీని అడ్డుకుంటామని కూనంనేని సాంబశివరావు అన్నారు. తమిళనాడు, కేరళ,ఢిల్లీ, తెలంగాణలో గవర్నర్ల తీరు సరిగా లేదన్నారు. బ్రిటీష్ కాలంలో వచ్చిన గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ గవర్నర్ బీజేపీ కార్యకర్తలా పనిచేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే తమిళిసై తెలంగాణను వదిలివెళ్లిపోవాలని సూచించారు. గవర్నర్ తీరుకు నిరసనగా త్వరలో రాజ్ భవన్ ను ముట్టడిస్తామని తెలిపారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ రీ ఓపెన్ చేయించడానికి సిపిఐ తరపున ఎన్నో పోరాటాలు చేశామని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. ఏడాది నుంచి పని చేస్తున్న ఫ్యాక్టరీని ఓపెన్ చేయడానికి ప్రధాని మోడీ రావడం ఏంటని ఆయన ప్రశ్నించారు. రామగుండంతో పాటు సింగరేణిని ప్రైవేటుపరం చేసేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని మండిపడ్డారు. మోడీ పర్యటన సందర్భంగా నిరసనలకు పిలుపునిచ్చారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ తెలంగాణకు వరప్రసాదం లాంటిదని చాడ వెంకట్ రెడ్డి అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసమే రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ పున:ప్రారంభానికి ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనకు వస్తున్నారని విమర్శించారు. అక్రమంగా ఏపీలో కలిపిన భద్రాచలం మండలానికి సంబంధించిన ఐదు గ్రామాలు తెలంగాణకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రామగుండం ఎరువుల కర్మాగారం బొగ్గుబావుల ఆధారితంగా నడుస్తుందన్నారు.

# శ్రీశైలంలో పోటెత్తిన భక్తులు



**కర్నూలు,నవంబర్8(సమ సమాజం):** కార్తీక పౌర్ణమితో శ్రీశైల మహాక్షేత్రంలో భక్తులు పోటెత్తారు. ప్రత్యేక అభిషేకాలు, లక్ష ఒత్తుల వెలిగింపు వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఉదయాన్నే భక్తులు పాతాళగంగ చేరుకుని పుణ్యస్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో అభిషేకాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 3లో ఆలయంలో కార్తీక మాసోత్సవాలను

# ప్రపంచ పర్యాటకుల భూతల స్వర్గంగా తెలంగాణ

## లండన్‌లో వరల్డ్ ట్రావెల్ మార్ట్‌లో స్టాల్● ప్రారంభించిన మంత్రి శ్రీనివాసగౌడ్

**హైదరాబాద్,నవంబర్8(సమ సమాజం):** ప్రపంచ పర్యాటకుల భూతల స్వర్గంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చి దిద్దుతున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. లండన్‌లో వరల్డ్ ట్రావెల్ మార్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ పర్యాటక శాఖ స్టాల్‌ను మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. అనంతరం అసోసియేషన్ ఆఫ్ బ్రిటిష్ ట్రావెల్ ఏజెంఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇండియా టూరిజం సెక్రటరీ అరవింద్ సింగ్‌తో కలిసి తెలంగాణలో సీఎం కేసీఆర్ పర్యాటకం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, చేస్తున్న కృషిని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకుని, పర్యాటక రంగాన్ని అభివృద్ది చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం పర్యాటక రంగం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. రామప్పకు యునెస్కో గుర్తింపు లభించిందని గుర్తు చేశారు. పోచంపల్లి గ్రామం ప్రపంచ పర్యాటక గ్రామంగా ఎంపికైందని, ఇందుకోసం సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేశారని స్పష్టం చేశారు. తెలంగాణలో అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని తెలిపారు. వివిధ దేశాల పర్యాటకులు తెలంగాణను సందర్శించాలని కోరారు. లండన్ డబ్ల్యూటీఎంలో తెలంగాణ రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాలపై సమగ్ర సమాచారాన్ని ఉచితంగా అందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. తెలంగాణలోని రామప్ప దేవాలయం, గోల్కొండ కోట, చార్మినార్, కుతుబ్ షాహీ టోంబ్స్, ఆసియా ఖండంలో అతిపెద్ద బుద్ధిజం ప్రాజెక్ట్ బుద్ధవనం, యాదాద్రి టెంపుల్, మన్యంకొండ, వేయి స్తంభాల గుడి, సమ్మక్క సారాలమ్మ, కేసీఆర్ అర్బన్ ఎకో పార్క్, కాళేశ్వరం ప్రాజెక్ట్, చారిత్రక వరంగల్ కోట వంటి ప్రఖ్యాత పర్యాటక ప్రదేశాల ఛాయాచిత్రాల ప్రదర్శనను డబ్ల్యూటీఎం వేదికగా ప్రదర్శిస్తున్నామని తెలిపారు. తెలంగాణ చరిత్ర, వారసత్వ సంపదతో పాటు బతుకమ్మను ప్రపంచ దేశాల పర్యాటకులకు తెలిసే విధంగా ఈ వరల్డ్ ట్రావెల్ మార్ట్ లో ప్రచారం చేస్తున్నామని మంత్రి శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. ఈ సమావేశంలో భారతదేశానికే తలమానికమైన కోహినూర్ వజ్రం గురించి సైతం చర్చించినట్లు తెలిపారు. సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ ఆఫ్ బ్రిటిష్ ట్రావెల్ ఏజెంట్స్ ప్రతినిధులను తెలంగాణను సందర్శించి రాష్ట్రంలోని పర్యాటక అభివృద్ధిని ప్రత్యక్షంగా వీక్షించాల్సిందిగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పర్యాటక శాఖ కార్యదర్శి అరవింద్ సింగ్, తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, పర్యాటకాభివృద్ధి శాఖ ఎండీ మనోహర్, పర్యాట శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మహేష్, అసోసియేషన్ ఆఫ్ బ్రిటిష్ ట్రావెల్ ఏజెంట్స్ డైరెక్టర్ సుషాన్ ధీర్, ఆబ్టా హెడ్ ఆంజెలా హిల్స్ తదితరులు పాల్గొన్నారు.



# విజయ పాల ఉత్పత్తులకు ప్రాధాన్యం

## పెద్ద ఎత్తున ప్రచారంతో అమ్మకాలు: తలసాని

**హైదరాబాద్,నవంబర్8(సమ సమాజం):** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే నూతనంగా ఔట్ లెట్ లను పెద్ద మొత్తంలో ఏర్పాటు చేసి విజయ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులో కి తీసుకవచ్చామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. తెలంగాణ స్టేట్ డైరీ డెవలప్ మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ నూతన చైర్మన్ సోమా భరత్ కుమార్ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడారు. రాష్ట్ర ఆవిర్భావానికి ముందు నష్టాలలో ఉన్న విజయ డైరీపై ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ప్రత్యేక చొరవ, శ్రద్ధ చూపడంతో నేడు 700 కోట్ల రూపాయల టర్నోవర్ కు చేరుకుందని మంత్రి చెప్పారు.విజయ డైరీ ఉత్పత్తులకు ఎంతో ప్రజాదరణ ఉందని, కానీ గత ప్రభుత్వాలు ప్రజలకు అందుబాటులోకి తీసుకు రాలేదని విమర్శించారు. ఇంకా మరిన్ని ఔట్ లెట్ లను ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడుతామన్నారు. విజయ పేరుతో డైరీ లో నూతనంగా అనేక ఉత్పత్తులను మార్కెట్ లోకి తీసుకరావడం జరిగిందన్నారు. పాడి రైతులను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్న విషయాన్ని కూడా మంత్రి వివరించారు. విజయ డైరీ అభివృద్ధి చర్యలలో భాగంగా 250 కోట్ల రూపాయల వ్యయంతో మెగా డైరీ నిర్మాణం చేపడుతున్నామని వివరించారు.



# ధాన్యానికి గిట్టుబాటు ధరలు అందిస్తాం

**చివరిగింజ వరకు కొనుగోలు చేస్తాం**

**ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎర్రబెల్లి**

**గౌడ కులస్థులతో మాటామంతీలో..కల్లు రుచి చూసిన మంత్రి**



పాలకుర్తి, నవంబర్ 8 (సమ సమాజం): రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడమే కాకుండా ఆఖరు గింజ వరకు ప్రభుత్వమే కొంటుందని పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వద్దు కొనమని చేతులెత్తేసినా, రైతు పక్షపాతి అయిన కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం నిలబడ్డారని ఎర్రబెల్లి తెలిపారు. పాలకుర్తి ప్రాథమిక రైతు వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వల్మీడి, అయ్యంగారిపల్లె గ్రామాల్లో మంత్రి ప్రారంభించారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని అన్నారు. ప్రతి ఏటా రూ. 3 వేల కోట్ల నష్టం వచ్చినా భరిస్తూ, ధాన్యం కొంటున్నామని మంత్రి వివరించారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చిన కేసీఆర్ మహాత్ముడని ఎర్రబెల్లి కొనియాడారు. రైతు బంధు, రైతు బీమా పథకాలు దేశానికే ఆదర్శమని అన్నారు. ఆడబిడ్డకు మేనమామగా కేసీఆర్ కళ్యాణాలక్ష్మి పథకం తెచ్చారని మంత్రి తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రూ. 500 పెన్షన్ కూడా రావడం లేదని, తెలంగాణలో రూ. 2వేలు, రూ.3 వేల రూపాయల పెన్షన్ ఇచ్చిన గొప్ప వ్యక్తి సీఎం కేసీఆర్ అని మంత్రి పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ప్రతి ఎకరానికి సాగు నీళు అందించిన ఘనత కేసీఆర్‌దేనని ఎర్రబెల్లి స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడా, ఏ ప్రభుత్వం కూడా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఎర్రబెల్లి అన్నారు. కరెంట్ మీటర్లు పెట్టాలని కేంద్రం కుట్ర చేసిందని, నా బొంది లో ప్రాణం ఉండగా మీటర్లు పెట్టనివ్వనని తేల్చి చెప్పిన మహానుభావుడు సీఎం కేసీఆర్ కేసీఆర్ అని గుర్తుచేశారు. రైతులు, బాగా డిమాండ్ ఉండే ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలు వేయాలని మంత్రి సూచించారు. ఎకరాకు లక్షా 40 వేల వరకు ఆదాయం వస్తున్నది. నియోజకవర్గంలో ప్రభుత్వ పరంగా ఆయిల్ పామ్ నర్సరీ, నూనె తీసే ఫ్యాక్టరీ నడిపిస్తున్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, సమస్యలు వస్తే వెంటనే పరిష్కరించాలని అధికారులను ఎర్రబెల్లి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతు సమన్వయ సమితి కమిటీ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు. వల్మీడి గ్రామంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఇవాళ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ. 6 కోట్లతో అభివృద్ధి చేస్తున్న రామాలయాన్ని మంత్రి సందర్శించారు. పనులపై ఆరా తీశారు. అనంతరం వల్మీడి నుంచి తిరిగి వస్తుండగా.. మార్గమధ్యంలో గీత కార్మికులు తారసపడ్డారు. మంత్రి ఎర్రబెల్లి వారి మండవ వద్దకు వెళ్లి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కల్లు బాగా పారుతోందా? లాభసాటిగా ఉంటోందా? పెన్షన్లు, బీమాలు అందుతున్నాయా? అంటూ ఆరా తీశారు. ఇదే సమయంలో మంత్రిని తమ కల్లు తాగాల్సిందిగా గౌడ సోదరులు కోరారు. తమ సంప్రదాయ కల్లును తాగి రుచి చూడాలని అభ్యర్థించారు. దీంతో గీత కార్మికుల కోరిక మేరకు, మంత్రి ఎర్రబెల్లి కల్లు రుచి చూశారు. కల్లు బాగుందంటూ గీత కార్మికులకు చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ గీత కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. ఆ పథకాల ఫలాలు అందరికీ అందాలన్నదే సీఎం కేసీఆర్ అభిమతమని మంత్రి తెలిపారు. దీంతో అక్కడున్న వాళ్ళంతా ఆనందం వ్యక్తం చేశారు.

# చంద్ర గ్రహణంతో ఆలయాల మూసివేత

## ఉదయమే పూజలు నిర్వహణ



హైదరాబాద్,నవంబర్8(సమ సమాజం): చంద్రగ్రహణం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఆలయాలు మూతపడ్డాయి. వేములవాడ రాజరాజేశ్వరస్వామి, యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి, భద్రాద్రి సీతారామచంద్రస్వామి ఆలయాలతో పాటు అన్ని ఆలయాలను నిత్య కైంకర్య పూజల అనంతరం మూసివేశారు. మధ్యాహ్నం 2.39 గంటల నుంచి సాయంత్రం 6.27 గంటల వరకు గ్రహణం కొనసాగనున్నది. ఈ క్రమంలో ఉదయం వేకువ జామున ఆయా ఆలయ ద్వారాలను తెరిచి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. గ్రహణం కారణంగా వేకువ జామున ఉదయం 5.30 గంటలకు రాజన్న ఆలయాన్ని అధికారులు మూసివేశారు. అంతకు ముందు స్వామివారికి ఉదయం సుప్రభాత సేవ, ప్రాతః కాలపూజ అనంతరం ద్వారాలను మూసివేయగా.. సాయంత్రం 6.18 గంటలకు ఆలయాన్ని తిరిగి తెరిచి పుణ్యహవచనం, సంప్రోక్షణ, నివేదన అనంతరం భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించనున్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా రాత్రి ఆలయ ఆవరణలో జ్వాలాతోరణం నిర్వహించడంతో పాటు స్వామివారి మహాపూజ నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి ప్రధాన ఆలయాన్ని మంగళవారం ఉదయం 8 గంటల 16 నిమిషాలకు అర్చకులు, అధికారులు నడుమ ద్వార బంధనం నిర్వహించారు. సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఉదయం 3 గంటల 30 నిమిషాలకు ఆలయాన్ని తెరిచిన అర్చకులు స్వయంభులకు నిజాభిషేకం, నిత్య కైంకర్యాలు, చేపట్టారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా జరుపబడే అన్నకూటోత్సవాన్ని అంతరంగీకంగా నిర్వహించి ఆలయ సాంప్రదాయబద్ధంగా ద్వారాన్ని మూసివేశారు. గ్రహణం కారణంగా భద్రాద్రి సీతారామ చంద్రస్వామి ఆలయాన్ని అధికారులు, అర్చకులు మంగళవారం ఉదయం మూసివేశారు. అంతకు ముందు మూలమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 7.30 గంటల వరకు మూసే ఉంచనున్నారు. గ్రహణం అనంతరం ద్వారాలు తెరిచి సంప్రోక్షణ చేయనున్నారు. ఆ తర్వాత దేవతామూర్తులకు అభిషేకం నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం సుప్రభాత సేవ నుంచి భక్తులను దర్శనాలకు అనుమతి ఇవ్వనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. భూపాపల్లి జిల్లా కాళేశ్వరంలోని కాళేశ్వర ముక్తేశ్వర ఆలయాన్ని ఉదయం అధికారులు మూసివేశారు. అలాగే అనుబంధ ఆలయాల్లోనూ ద్వారబంధనం నిర్వహించారు. స్వామివారికి నిత్య కైంకర్యాల అనంతరం ఆలయాన్ని మూసివేశారు. బుధవారం సంప్రోక్షణ అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించనున్నారు. మరో వైపు కార్తీక పౌర్ణమి సందర్భంగా గోదావరిలో భక్తులు పుణ్య స్నానాలు చేశారు. అనంతరం గోదావరిలో కార్తీక దీపాలను వదిలారు. సుబ్రహ్మణెళీశ్వరస్వామి వారికి మొక్కులు చెల్లించారు. చందగ్రహణం సందర్భంగా బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయాన్ని అధికారులు మూసివేశారు. గ్రహణం పూర్తయిన అనంతరం.. సాయంత్రం 7 గంటలకు ఆలయం తెరచి మహాసంపోక్షణ చేయనున్నారు. గ్రహణం సందర్భంగా అన్ని సేవలు రద్దు చేసినట్లు ఆలయ అధికారులు అధికారులు పేర్కొన్నారు. అంతకు ముందు వేకువ జామున ఆలయంలో అమ్మవారికి నిత్యపూజలు నిర్వహించారు.

# పడిపోతున్న ఢిల్లీ గాలి నాణ్యత

**పొగమంచులా కమ్మేస్తున్న వాయు కాలుష్యం ○ భారత్‌లో మొత్తం 163 కాలుష్యనగరాల గుర్తింపు**



న్యూఢిల్లీ,నవంబర్8(సమ సమాజం): దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత పడిపోయింది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 321 చేరినట్లు అధికారులు తెలిపారు. పొగ మంచులా వాయు కాలుష్యం కమ్మేసిందన్నారు. నోయిడా 354, గురుగ్రామ్ 326, ధీర్పూర్ 339, ఢిల్లీ యూనివర్సిటీలో 336 గా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ నమోదు అయింది. ఇప్పటికే ఎయిర్ పొల్యూషన్ కారణంగా ఢిల్లీలో స్కూల్స్ కు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. ఆన్ లైన్ క్లాసులు నిర్వహిస్తున్నారు. అయితే రేపటి నుంచి స్కూల్స్ రీ ఓపెన్ చేయనున్నట్లు ప్రకటించింది. వాయు కాలుష్యం కాస్త తగ్గడంతో స్కూల్స్ తెరుస్తున్నట్లు తెలిపింది. రెండు రోజుల నుంచి చూస్తే ఎయిర్ క్వాలిటి మెరుగ్గా ఉందన్నారు. రెండు రోజుల క్రితం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 326 ఉండగా తాజాగా 321 నమోదైంది. అలాగే ప్రభుత్వ సంస్థలు కూడా ఓపెన్ కానున్నాయి. ప్రస్తుతం ఉద్యోగులు వర్క్ ఫ్రం హోమ్ చేస్తున్నారు. భారత్‌లో ఈ ఏడాది కాలుష్య స్థాయిలు మరింత దిగజారాయి. భారత్‌లో మొత్తం 163 నగరాలు కాలుష్య నిలయాలుగా మారాయని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డ్ (సిపిసి) విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. ఈ నగరాల్లో కాలుష్య స్థాయిలు ప్రమాదకరంగా ఉన్నట్లు సిపిసి పేర్కొంది. వాయు నాణ్యతా సూచీ (ఎక్యూఐ) అత్యధికంగా 360తో బీహార్‌లో కతిహార్ మొదటి స్థానంలో ఉండగా, తర్వాతి స్థానాల్లో వరుసగా ఢిల్లీ, నొయిడా, ఘజియాబాద్, బీహార్‌లోని బెగుసరై, హర్యానాలోని బల్లాబ్‌ఘర్, ఫరీదాబాద్, ఖైతిహాల్, గురుగ్రామ్, మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లు నిలిచాయి. వాహన కాలుష్యంతో పాటు పంటవ్యర్థాలను తగుల బెట్టడంతో కాలుష్య స్థాయిలు ప్రమాదకరస్థాయికి చేరుకుంటున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. బుధవారం ఒక్కరోజే పంజాబ్‌లో 3,634 పంట వ్యర్థాలను తగులబెట్టినట్లు ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎఆర్‌ఐ) పేర్కొంది. ఈ ఏడాదిలో ఇదే అత్యధికమని వెల్లడించింది. విషవాయువులు ప్రజల ఊపిరితిత్తులపై ప్రభావం చూపడమే కాకుండా శ్వాసకోస సమస్యలతో అకాల మరణాలకు దారితీస్తున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. 2017లో వాయు కాలుష్యం కారణంగా 1.2 మిలియన్లకు పైగా భారతీయులు అకాల మృత్యు బారిన పడినట్లు గ్రీన్‌పీస్ సంస్థ తెలిపింది.

# మునుగోడు ప్రజలు బిజెపికి బుద్ధి చెప్పారు



**ఓడించి తగిన గుణపాఠం నేర్పారు**

**తెలంగాణలో ఒక్క పని చేయలేని బిజెపి నేతలు**

**దేశానికి కెసిఆర్ దిశా నిర్దేశం చేయడం ఖాయం**

**మీడియా సమావేశంలో మంత్రి ఎర్రబెల్లి**

జనగాం,నవంబర్8(సమ సమాజం): మునుగోడు ప్రజలు బీజేపీకి, కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పి, చెప్పుతో కొట్టినట్లు తీర్పునిచ్చారని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మనుగోడు విజయాన్ని కుట్రలు కుతంత్రాలు, ఢిల్లీ పెద్దల అహంకారంపై విజయంగా, ఎమ్మెల్యేల కొనుగోలును నిలదీసిన నిఖార్సైన తెలంగాణ విజయంగా మంత్రి అభివర్ణించారు. మంగళవారం జనగాం టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సంపత్ రెడ్డి, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, తాటికొండ రాజయ్యలతో కలిసి ఎర్రబెల్లి మీడియాతో మాట్లాడారు. చారిత్రాత్మక తీర్పు ఇచ్చిన మునుగోడు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. బండి సంజయ్, అమిత్ షా చెప్పులు మోశాడు కాబట్టే ఢిల్లీ వరకు తెలిసేటట్లు మునుగోడు ప్రజలు చెప్పుతో కొట్టినట్టు టీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టారని అన్నారు. బీజేపీ రాజగోపాల్ రెడ్డిని రూ. 18 వేల కోట్లకు కొని ఆయనను బలిపశువును చేసిందని ఆరోపించారు. ఎన్నికల కోసం హైదరాబాద్ భాగ్యలక్ష్మి దేవాలయాన్ని, వరంగల్ భద్రకాళి ఆలయం, మునుగోడు ఉప ఎన్నిక కోసం యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని అడ్డు పెట్టుకొని నాటకం ఆడారని మంత్రి విమర్శించారు. మునుగోడు ప్రజలు వారి నాటకాలకు తెరదించారని తెలిపారు. మునుగోడులో బీజేపీ ఇచ్చిన హామీలను దేశమంతటా అమలు చేయాలని డిమాండ్ చేశారు. భారత దేశాన్ని బంగారుమయం చేయడానికి కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీని మునుగోడు ప్రజలు తమ తీర్పుతో దీవించారు. మునుగోడులో టిఆర్ఎస్ గెలుపు మునుగోడు అభివృద్ధికే కాకుండా దేశ రాజకీయాల్లోనూ కీలక మలుపని తెలియజేశారు.బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీకి అనుమతులు తేలేని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సిగ్గు లేదు. కరీంనగర్‌లో కనీసం ఒక్క మెడికల్ కాలేజీ తెచ్చుకోలేని దద్దమ్మ బండి సంజయ్ అని మంత్రి విమర్శించారు. బీజేపీ ప్రభుత్వ రంగాలను ప్రైవేట్ పరం చేయాలని చూస్తుందని అన్నారు. ధరలు పెరుగుదలకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే ప్రధాన కారణం అని దుయ్యబట్టారు. తెలంగాణలోని 7 మండలాల్ని ఆంధ్రప్రదేశ్‌లో కలపడం, రాష్ట్ర విభజన హామీలు విస్మరించడం, కాళేశ్వరానికి జాతీయహోదా ఇవ్వకపోవడంతో పాటు రాష్ట్రానికి రావాల్సిన నిధుల్లో కోత విధించడం బీజేపీ కుట్రకు నిదర్శనమని ఎర్రబెల్లి అన్నారు. బీజేపీ డబ్బులిచ్చి ఎమ్మెల్యేలను కొనాలని చూస్తోందని ధ్వజమెత్తారు. బియ్యం కొనమంటే, తెలంగాణ ప్రజలకు నూకలు తినడం నేర్పాలని కేంద్ర మంత్రి పీయూష్ గొయల్ అంటారని, ఉచితంగా 24గంటలు కరెంటు ఇస్తుంటే, మోటర్లకు మీటర్లు పెడతామంటారని మంత్రి ఆరోపించారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ, జిల్లాకో నవోదయ స్కూల్ హామీల సంగతేంటని ఎర్రబెల్లి బీజేపీని ప్రశ్నించారు. 157 మెడికల్ కాలేజీల్లో తెలంగాణకు ఒక్కటీ ఇవ్వలేదని, ఐటిఐఆర్ మంజూరు చేయలేదని, బుల్లెట్ ట్రైన్, హై స్పీడ్ రైలు కూడా అంతే సంగతులని మంత్రి అన్నారు. తలసరి ఆదాయం, సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, ఐటీ, పరిశ్రమలు.. ఇలా ప్రతీ రంగంలో తెలంగాణ దేశంలో నెంబర్ వన్‌గా ఉందని మంత్రి అన్నారు. తెలంగాణలో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు లేవని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనే దేశానికి శ్రీరామ రక్ష అని, కేసీఆర్ ఉన్నంత కాలం బీజేపీ నేతల ఆటలు సాగవని ఎర్రబెల్లి హెచ్చరించారు.

# శ్రీశైలంలో పోటెత్తిన భక్తులు

(రెండోవ పేజి తరువాయి) తోడు పౌర్ణమి కావడంతో అభిషేకాలు నిర్వహించారు. కార్తీకమాసంలో భక్తుల రాకను దృష్టిలో పెట్టుకుని పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఆధ్యాత్మికంగా ఆకట్టుకునేలా సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

# విచ్ఛిన్న శక్తులకు తెలంగాణలో స్థానం లేదు

**మునుగోడులో ప్రజలు అదే నిరూపించారు**

**బిజెపికి గట్టిగా బుద్ధి చెప్పారన్న గుత్తా**

నల్గొండ,నవంబర్8(సమ సమాజం): మునుగోడు ఎన్నికల్లో ప్రజలు బీజేపీ నిరంకుశ విధానాలను తిప్పికొట్టారని నల్గొండ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నల్గొండలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మునుగోడు ఉప ఎన్నికల్లో లౌకికవాదులు, సీఎం కేసీఆర్ గెలిచారన్నారు. మునుగోడులో మతోన్మాద, విచ్ఛిన్నకర శక్తులకు చెంపపెట్టులా తీర్పు వచ్చిందని అన్నారు. ఉప ఎన్నికలు ప్రజల ఆకాంక్షలను వెల్లడించాయని, తెలంగాణలో విచ్ఛిన్నకర శక్తులకు స్థానం లేదని రుజువైందన్నారు. దేశానికి మార్గదర్శనంలా రాజకీయాలు ఉండాలన్నారు. ఎన్నికల్లో కేంద్రం ఐటీ డిపార్ట్‌మెంట్‌ను కూడా వాడారని విమర్శించారు. ఇది అత్యంత దుర్మార్గమని, ఇప్పటికే ఈడీ, సీబీఐ నవ్వుల పాలయ్యాయని, తాజాగా ఇన్‌కం టాక్స్ డిపార్ట్‌మెంట్‌ను సైతం దిగజార్చారని మండిపడ్డారు. దేశ రాజకీయాల్లో కేసీఆర్ అవసరం చాలా ఉందన్న ఆయన.. సామాన్య ఆకాంక్షలు నెరవేర్చేలా కేసీఆర్ పాటుపడుతారని, ఆయనపై దేశ ప్రజలకు నమ్మకం పెరిగిందన్నారు. అన్నిరంగాల్లో తెలంగాణ నేడు నంబర్ వన్ స్థానంలో నిలిచిందని, ఇవాళ తెలంగాణ మోడల్ దేశానికి అవసరమన్నారు. ఈ ఎన్నికతో కోమటిరెడ్డి బ్రదర్స్ రాజకీయంగా ఆత్మహత్య చేసుకున్నారన్నారు. బలవంతంగా రుద్దిన మునుగోడు ఎన్నికలతో కోమటిరెడ్డి సోదరులు రాజకీయంగా నష్టపోయారన్నారు. పన్నులు వేస్తూ ప్రజలను దోచుకుంటున్న బీజేపీకి తగిన బుద్ధి చెప్పారని, సామాన్యులకు శరాఘాతంగా కేంద్ర పాలన మారిందని గుత్తా సుఖేందర్‌రెడ్డి విమర్శించారు.

# సానియా-షోయబ్‌ల బంధంపై నీలినీడలు

**ఇద్దరు విడిపోతున్నారంటూ సోషల్ మీడియాలో కథనాలు**

**పాక్ మీడియాలోనూ వరుస కథనాలు**


**తాజాగా సానియా పోస్ట్‌పై మరింత అనుమానం**



హైదరాబాద్,నవంబర్8(సమ సమాజం): భారత టెన్నిస్ స్టార్ సానియా మిర్జా, పాకిస్థాన్ క్రికెట్ మాజీ కెప్టెన్ షోయబ్ మాలిక్ జంట విడిపోనున్నారన్న వార్తలు సంచలనం రేకెత్తిస్తున్నాయి. సోషల్ మీడియా వేదికగా వీరి విడిపోతున్నారంటూ ప్రచారం సాగుతోంది. అయితే ఈ ప్రచారన్ని ఎవరు కూడా ఖండించడం లేదు. వీరి బంధం దెబ్బిన్నదన్న వ్యాఖ్యలు వస్తున్నాయి. దీనికితోడు ఇటీవల తన ఇన్‌స్టాలో సానియా చేసిన ఓ వ్యాఖ్య కూడా దీనిని బలపరిచేదిగా ఉంది. దీనికితోడు వీరిద్దరూ గత కొంతకాలంగా వేర్వేరుగా ఉంటున్నట్టు సమాచారం. సానియా-మాలిక్‌ల పెళ్లి 2010 ఏప్రిల్‌లో జరిగింది. 2018లో వీరికి ఓ బాబు జన్మించాడు. వివాహం అయినప్పటినుంచి సానియా, షోయబ్ దుబాయ్‌లో ఉంటున్నారు. గతంలో ఈ జోడీ దుబాయ్‌లోని అత్యంత ఖరీదైన పామ్‌జుమేరా ఐలాండ్‌లోని విలాసవంతమైన విల్లాలో ఉండేవారు. కానీ కుమారుడి స్కూల్ కోసం దుబాయ్‌లోని మరో ప్రాంతంలో కొనుక్కున్న కొత్త ఇంట్లోకి కొద్దినెలల కిందటే సానియా మారింది. అయితే వీరు విడిపోవడానికి గల కారణాలు ఏమిటన్నది కచ్చితంగా తెలియకున్నా..పాక్‌కు చెందిన ఓ మోడల్‌తో షోయబ్ చేసిన హాట్ ఫొటోషూట్‌వల్లేనని అంటున్నారు. షోయబ్‌కు ఆ మోడల్‌తో బంధంపై కూడా చాలా పుకార్లే వచ్చాయి. అలాగే ఈ మధ్య షోయబ్ తన టీవీ షో ఒకదానిలో సానియా నిర్వహించే టెన్నిస్ అకాడమీల గురించి చెప్పాలని ఓ అభిమాని అడగ్గా..అసలు ఆమెకు ఎక్కడెక్కడ అకాడమీలున్నాయో తనకు సరిగా తెలియదని సమాధానమిచ్చాడు. షోయబ్ జవాబుతో కంగుతిన్న వకార్ యూనిస్ 'నువ్వేమి భర్తవయ్యా' అని వ్యాఖ్యానించడం గమనార్హం. అంతేకాదు ఇటీవల సానియా ఇన్‌స్టాలో చేసిన ఓ పోస్ట్ కూడా వారు విడిపోనున్నారన్న పుకార్లకు బలం చేకూర్చింది. 'బద్దలైన హృదయాలు అల్లాను వెతుక్కుంటూ వెళతాయి' అన్న ఆ పోస్ట్ సానియా, షోయబ్ మధ్య సంబంధాలు సక్రమంగా లేవన్న అనుమానాలను కలిగించింది. ఏమైనా ఇప్పుడు రెండు దేశాల్లో సంచలనం సృష్టిస్తున్న పుకార్లకు సానియా, షోయబ్ మాత్రమే తెరదించాల్సి ఉంటుంది.హైదరాబాదీ టెన్నిస్ స్టార్ సానియా మిర్జా.. పాకిస్థాన్ క్రికెటర్ షోయెబ్ మాలిక్ మధ్య వైవాహిక బంధం బలహీనపడినట్లు తెలుస్తోంది. మాలిక్‌తో బ్రేకప్ చెప్పేందుకు సానియా సిద్ధమైనట్లు సంకేతాలు అందుతున్నాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో సానియా తాజాగా చేసిన ఓ పోస్టు ఆ ఇద్దరి వైవాహిక బంధంలో సమస్యలు ఉన్నట్లు స్పష్టం చేస్తోంది. సానియా, మాలిక్ జంట విడాకులు తీసుకునే అవకాశాలు ఉన్నట్లు కూడా రూమర్లు వ్యాపిస్తున్నాయి. సానియా తన ఇన్‌స్టాలో చేసిన పోస్టు ఆమె అభిమానుల్లో ఆందోళన కలిగిస్తోంది. పగిలిన హృదయాలు ఎక్కడికి వెళ్తాయి.. అల్లాను చేరేందుకేనా అంటూ సానియా తన ఇన్‌స్టాలో ఓ పోస్టు చేసింది. నిజానికి సానియా, మాలిక్ మధ్య ఎటువంటి సమస్యలు ఉన్నాయో ఇంకా స్పష్టంగా తెలియదు. కానీ పాకిస్థాన్‌లోని మీడియా నివేదికల ఆధారంగా.. సోనియాను సోయెబ్ చీట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మాలిక్, సోనియా విడిపోయారని, ఆ ఇద్దరూ ప్రస్తుతం వేర్వేరుగా జీవిస్తున్నట్లు పాక్ మీడియా పేర్కొన్నది. షోయెబ్, సానియా జంటకు ఓ కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం సానియా వద్ద నాలుగేళ్ల ఇజాన్ ఉన్నట్లు తెలుస్తోంది. కానీ ఇద్దరి మధ్య వచ్చిన స్పర్థలకు సంబంధించి ఇప్పటి వరకు ఎవ్వరు కూడా ఎటువంటి విషయాన్ని వెల్లడించలేదు. 2010లో సానియా, షోయెబ్ పెళ్లి ఘనంగా జరిగింది. ఇజాన్ మాలిక్ బర్త్‌డేను ఇటీవల దుబాయ్‌లో జరుపుకున్నారు. ఆ ఫోటోలను మాలిక్ తన ఇన్‌స్టాలో షేర్ చేశాడు. కానీ సానియా మిర్జా మాత్రం ఆ ఫోటోలను షేర్ చేయలేదు. తాజాగా సానియా తన ఇన్‌స్టాలో చేసిన పోస్టు కొంత అర్ధంకాని తీరిలో ఉన్నా.. కొన్ని రోజుల క్రితం చేసిన మరో పోస్టు కూడా భిన్న భావాన్ని వ్యక్తం చేసింది.


# సీనియర్ ఐఏఎస్ శ్రీలక్ష్మికి ఊరట

**ఓబులాపురం గనుల కేసు కొట్టేసిన హైకోర్టు**



హైదరాబాద్,నవంబర్8(సమ సమాజం): సీనియర్ ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మిలో భారీ ఊరట లభించింది. ఓబులాపురం మైనింగ్ కంపెనీ కేసులో శ్రీలక్ష్మికి హైకోర్టు క్లీన్ చిట్ ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో శ్రీలక్ష్మిని న్యాయస్థానం నిర్దోషిగా పరిగణించింది. ఐఏఎస్ అధికారిపై ఉన్న అభియోగాల్ని ధర్మాసనం కొట్టివేసింది. ఓఎంసీ నుంచి ముడుపులు తీసుకున్నారని శ్రీలక్ష్మి ఆరోపణలు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. సీబీఐ కేసు నమోదుతో ఏడాది పాటు ఐఏఎస్ అధికారిని జైలులో గడపాల్సి వచ్చింది. కాగా... ఈ కేసుకు సంబంధించి తెలంగాణ హైకోర్టు క్లీన్‌చిట్ ఇవ్వడంతో శ్రీలక్ష్మి ఏపీ చీఫ్ సెక్రటరీగా నియమితులు అయ్యేందుకు అడ్డంకులు పూర్తిగా తొలగిపోయాయి

# చలన చిత్రం



## మాయోసైటిస్‌తో పోరాడుతున్నా దాన్ని జయిస్తానన్న నమ్మకుందున్న సమంత

స్టార్ హీరోయిన్ సమంత అరుదైన వ్యాధి బారిన పడిన విషయం తెలిసిందే. తాను 'మయోసైటిస్' అనే అరుదైన వ్యాధికి చికిత్స తీసుకుంటున్నట్లు ఆమె ఇటీవల సామాజికమాధ్యమాల ద్వారా వెల్లడించింది. కొద్ది నెలల క్రితం తనకు ఈ వ్యాధి ఉన్నట్లు వైద్యులు గుర్తించినట్లు చెప్పుకొచ్చింది. ఒకవైపు చికిత్స తీసుకుంటూనే తన కొత్త సినిమాకు డబ్బింగ్ చెబుతున్న ఫొటోను సైతం షేర్ చేసి అందరినీ షాక్‌కు గురి చేసింది. కాగా, తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మయోసైటిస్ వ్యాధి గురించి మాట్లాడుతూ భావోద్వేగానికి గురైంది.'నేను గత కొన్ని రోజులుగా మయోసైటిస్ అనే వ్యాధితో బాధపడుతున్నా. ప్రస్తుతం నాకు ప్రాణాపాయం లేదు. నేను దీనిపై పోరాటం చేయాలి. ఒక్కోసారి ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేనేమో అనిపిస్తుంది. ఒక్కోసారి ఇంత దాటి వచ్చానా అనిపిస్తుంది. కొన్ని మంచిరోజులు ఉంటాయి.. కొన్ని చెడ్డ రోజులు ఉంటాయి. ఇలా పోరాటం చేస్తున్నది నేను ఒక్కదాన్నే కాదు. నాలా చాలా మంది పోరాటం చేస్తున్నారు. ఈ వ్యాధిపై నేను పోరాటం చేస్తా.. చివరకు గెలుస్తానన్న నమ్మకం నాకు ఉంది' అంటూ సమంత తన ఆరోగ్య పరిస్థితి గురించి చెబుతూ భావోద్వేగానికి లోనయ్యింది. సమంత లీడ్ రోల్ పోషిస్తున్న చిత్రం యశోద. హరి-హరీష్ దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ ఇండియా కథాంశంతో యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం నవంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమైంది. శ్రీదేవి మూవీస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రంలో రావు రమేశ్, వరలక్ష్మి శరత్ కుమార్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. మణిశర్మ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో వస్తున్న యశోదను శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ మూవీలో ఉన్ని ముకుందన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే చిత్రం నుండి రిలీజైన ప్రచార చిత్రాలు, ట్రైలర్ సినిమాపై విపరీతమైన అంచనాలు క్రియేట్ చేశాయి. సస్పెన్స్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం నవంబర్ 12న రిలీజ్ కానుంది. ఈ క్రమంలో మేకర్స్ వరుస అప్‌డేట్‌లను ప్రకటిస్తూ సినిమాపై క్యూరియాసిటీను పెంచుతున్నారు. ప్రస్తుతం చిత్రబృందం ప్రమోషన్‌లతో బిజీగా గడుపుతున్నారు.సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రంలో వరలక్ష్మి శరత్‌కుమార్, ఉన్నీ ముకుందన్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీదేవీ మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మిస్తున్నాడు. సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని పాన్ ఇండియా లెవల్లో తెలుగుతో పాటు హిందీ, తమిళ్, కన్నడ, మలయాళం భాషల్లో విడుదల చేయాలని చిత్ర బృందం భావిస్తుంది. అయితే ఈ చిత్రం ఆగస్టు 12నే విడుదల కావాల్సి ఉంది. కానీ పలు కారణాల వల్ల మూడు నెలలు పోస్ట్ పోన్ అయింది.

## ఊర్వశివో..రాక్షసివో

### టాక్‌కు తగ్గట్లుగా లేని కలెక్షన్లు



ఓటీటీల ప్రభావమో లేక టిక్కెట్ రేట్లు థియేటర్లకు రావడం వల్ల పెరుగుతున్న ఖర్చుల ప్రభావమో ఏమో గానీ స్టార్స్ నటించిన సినిమాలకు ఈ మధ్య కాలంలో టాక్ కు తగ్గట్టుగా కలెక్షన్లు కావడం లేదు. కొన్ని సినిమాలకు రికార్డు స్థాయిలో ఊహించని విధంగా వసూళ్ల వర్షం కురుస్తుంటే మరి కొన్ని సినిమాలకు మాత్రం టాక్ కు వసూళ్లకు సంబంధం వుండటం లేదు. ఈ మధ్య కాలంలో విడుదలైన 'కాంతార' ఎవరూ ఊహించని విధంగా వసూళ్ల సునామీని సృష్టించి మేకర్స్‌తో పాటు ట్రేడ్ పండితుల్ని ఆశ్చర్య పరిచింది. తెలుగు వెర్షన్ ప్రపంచ వ్యాప్తంగా దాదాపు రూ. 40 కోట్ల వరకు వసూళ్లని రాబట్టింది. అయితే ఇటీవల విడుదలైన తెలుగు సినిమాల పరిస్థితి మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా వుండటం గమనార్హం. అల్లు శిరీష్ నటించి రొమాంటిక్ లవ్ స్టోరీ 'ఊర్వశివో రాక్షసివో'. అను ఇమ్మాన్యుయేల్ హీరోయిన్‌గా నటిచిన ఈ మూవీ రీసెంట్‌గా విడుదలై మంచి టాక్ ని సొంతం చేసుకుంది. ఈ టాక్‌ని దృష్టి లో పెట్టుకున్న ట్రేడ్ వర్గాలు ఈ మూవీ డీసెంట్ వసూళ్లని రాబడుతుందని ఊహించారు. ప్రేక్షకుల నుంచి పాజిటివ్ టాక్ విమర్శకుల నుంచి సూపర్ రెస్పాన్స్‌తో పాటు మంచి రేటింగ్స్ దక్కడంతో ఈ మూవీ ఖచ్చితంగా బాక్సాఫీస్ వద్ద భారీ స్థాయిలో వసూళ్లని రాబట్టడం ఖాయం అని అంతా భావించారు. కానీ వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తోంది. టాక్ బాగానే వున్నా అందుకు తగ్గట్టుగా వసూళ్లు మాత్రం కనిపించడం లేదు. రాకేష్ శశి డైరెక్షన్ లో అల్లు అరవింద్ సమర్పకుడిగా వ్యవహరించిన ఈ మూవీ ఇటీవలే విడుదలయ్యింది. ఈ మూవీ వరల్డ్ వైడ్ గా రూ. 3.75 కోట్ల గ్రాస్ ని మాత్రమే వసూలు చేసింది. ఎంత సూపర్ హిట్ టాక్ వున్నా కానీ వసూళ్ల పరంగా ఆ స్థాయి కనిపించకపోవడం విచిత్రంగా వుందని ట్రేడ్ పండితులు అంటున్నారు.

## తమిళంలో హిట్ కొట్టిన లవ్‌టుడే




తెలుగులో విడుదలకు దిల్‌రాజ్ సన్నాహాలు

ఈ మధ్య కాలంలో భాషతో సంబంధంలేకుండా కథ, కథనం కొత్తగా ఉంటే చాలు ప్రేక్షకులు అన్ని భాషల సినిమాలను ఆదరిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటికే అలా ఎన్నో సినిమాలు తెలుగులో డబ్ అయి ఘన విజయాలు సాధించాయి. ఈ క్రమంలో ఓ తమిళ సినిమా డబ్బింగ్ రిలీజ్‌కు సిద్ధమైంది. ఇటీవలే తమిళంలో రిలీజై బ్లాక్ బస్టర్ వసూళ్ళతో దూసుకుపోతున్న 'లవ్ టుడే' సినిమా తెలుగు విడుదలకు ముస్తాబవుతుంది. ప్రదీప్ రంగనాథన్ నటిస్తూ, దర్శకత్వం వహించిన ఈ చిత్రం తమిళంలో నవంబర్ 4న రిలీజై పాజిటీవ్ టాక్ తెచ్చుకుంది. ఈ చిత్రానికి తమిళ ప్రేక్షకుల నుండి విపరీతమైన రెస్పాన్స్ రావడంతో తెలుగులో కూడా ఈ సినిమాను రిలీజ్ చేయాలని చిత్రబృందం సన్నాహాలు చేస్తుంది. ఈ సినిమా తెలుగు హక్కులను దిల్‌రాజు దక్కించుకున్నట్లు టాక్. కాగా ఈ చిత్రాన్ని నవంబర్ 18న రిలీజ్ చేయాలని దిల్‌రాజు ప్లాన్ చేస్తున్నాడట. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇద్దరు ప్రేమికులు వాళ్ల ప్రేమను పెళ్ళివరకు తీసుకెళ్ళాలని నిర్ణయించుకుంటారు. ఈ క్రమంలో అబ్బాయి, అమ్మాయి వాళ్ల నాన్నతో పెళ్లి గురించి మాట్లాడాలని ఆయన్ని కలుస్తాడు. అయితే అమ్మాయి తండ్రి వీళ్ళిద్దరికి ఓ టెస్ట్ పెడతాడు. వీరిద్దరిని ఒకరి ఫోన్ ఒకరు ఎక్స్‌చేంజ్ చేసుకోని ఒక రోజు ఉండమంటారు. మరుసటి రోజు కూడా పెళ్ళి చేసుకుందాం అనుకుంటే నాకు ఓకే అని చెప్తాడు. దాంతో ఈ ఇద్దరు ప్రేమికులు బయపడుతూనే ఒకరి ఫోన్ మరోకరు ఎక్స్‌చేంజ్ చేసుకుంటారు. ఆ తర్వాత మెల్లిగా ఒకరి పర్సనల్ విషయాలు మరోకరికి తెలిసిపోతుంటాయి. ఈ క్రమంలో వారిద్దరి మధ్య గొడవలు స్టార్ట్ అవుతాయి. ఆ గొడవలు పెళ్లి వరకు తీసుకెళ్తాయా.. లేదా మధ్యలోని పెళ్లి పెటాకులవుతుందా అనే కథాంశంతో ఈ సినిమా తెరకెక్కింది. యువన్ శంకర్ రాజా సంగీతం అందించిన ఈ చిత్రాన్ని ఏజీఎస్ ఎంటర్‌టైనమెంట్ బ్యానర్‌పై కల్పతి ఎస్. అఘోరం, కల్పతి ఎస్. గణెళిష్, కల్పతి ఎస్. సురేష్ సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రంలో ప్రదీప్‌కు జోడీగా ఇవానా రవి హీరోయిన్‌గా నటించింది. సత్యరాజ్, రాధికా కీలకపాత్ర పోషించారు.



## కొత్త నటులతో రాజయోగం

సాయి రోనక్, అంకిత సాహా, బిస్మి నాస హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'రాజయోగం'. రామ్ గణపతి దర్శకత్వంలో మణి లక్ష్మణ్ రావు నిర్మిస్తున్నారు. డిసెంబర్ 9న సినిమా రిలీజ్ కానుంది. ఈ మూవీ టీజర్‌ను విడుదల చేసిన విశ్వక్ సేన్ ..టీజర్ చాలా బాగుందని, హీరో హీరోయిన్స్ ఇంప్రెసివ్‌గా ఉన్నారన్నాడు. సాయి రోనక్ మాట్లాడుతూ 'రొమాన్స్, కామెడీ, యాక్షన్ అన్నీ ఉంటాయి. డబుల్ మసాలా బిర్యానీ లాంటి సినిమా' అన్నాడు. సరికొత్త కాన్సెప్ట్‌తో టాలీవుడ్ ఎంట్రీ ఇవ్వడం హ్యాపీగా ఉందన్నారు హీరోయిన్స్. యూత్‌ని ఆకట్టుకునేలా ఉంటుందన్నారు దర్శకుడు రామ్ గణపతి. నిర్మాత మాట్లాడుతూ 'ఈ సినిమా మా టీమ్ అందరికీ 'రాజయోగం' తెస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు. ఇక రీసెంట్‌గా తనపై అర్జున్ చేసిన ఆరోపణలపై విశ్వక్ మాట్లాడుతూ ' నేను చెప్పిన ఏ సూచననూ అర్జున్ గారు పట్టించుకోలేదు. ఆ కథ గురించి మరోసారి డిస్కస్ చేద్దామనే ఆ రోజు షూటింగ్ వద్దని చెప్పాను. ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చా. మళ్లీ మొదటి మెట్టుకు దిగజారొద్దనే ఈ జాగ్రత్తలు.. అంతే గానీ అర్జున్ గారిని అగౌరవపరచాలని కాదు. నేను ఫ్రొఫెషనల్ నటుడినే. నా అంత కమిటెడ్‌గా ఎవరూ ఉండరు'అన్నాడు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA, Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in